ప్రజాశక్తి

సోమవారం 15 జనవరి 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



ధరాఘాతం

- సంక్రాంతి జరుపుకునేదెలా...?
- ఆందోళనలో పేద, మధ్య తరగతి ప్రజలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ముఖ్యంగా బియ్యం, పప్పులు, వంట నూనెల రేట్లు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. గత ఏడాది సంక్రాంతితో పోల్చితే ప్రస్తుతం ఒక్కో కుటుంబంపై కనిష్టంగా రూ.2000 నుంచి గరిష్టంగా రూ.5000 వరకు అదనపు భారం పడుతోందంటే ధరల పెరుగుదల ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్న ఉద్యోగస్తులతో పాటు, పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇటువంటి తరుణంలో పెరుగుతున్న ధరలు సామాన్యులకు మరింత భారంగా పరిణమించాయి. గతంలో రూ.5 వేలు తీసుకుని మార్కెట్‌కు వెళితే నెలకు సరిపడా వంటింటి సరకులు వచ్చేవని, ఇప్పుడు అంతే మొత్తానికి 20 రోజులకు కూడా రావడం లేదని నగరంలోని అల్లిపురం ప్రాంతానికి చెందిన కర్రి లక్ష్మి ఆవేదన వ్యక్తంచేశారు. నిత్యావసర సరకుల ధరలను నియంత్రించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టనట్టు వ్యవహరించడం వల్ల తమలాంటి సాధారణ, మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తోందని పాత నగరం, ప్రసాద్ గార్డెన్స్‌కి చెందిన ఎం.అన్నపూర్ణ వాపోయారు. పెరిగిన ధరలతో మార్కెట్‌కు వెళ్లాలంటేనే భయమేస్తోందని, ప్రతినెలా పప్పులు తదితర రేట్లు పరుగు పెడుతున్నాయని అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి లక్ష్మణరావు ఆవేదన వ్యక్తంచేశాడు.

పెను భారం

గత ఏడాది జనవరితో పోలిస్తే జూన్ మాసం వరకు ధరల పెరుగుదల ఉంది. అలాగని అక్కడితో ఆగిపోలేదు. జూన్ నెల నుంచి ఈ ఏడాది జనవరి సంక్రాంతి రోజు వరకు అన్ని నిత్య అవసరాల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ధరల భారం పోల్చితే ఒక్కో కుటుంబంపై రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ప్రతి నెలా పెరిగింది. దీంతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. ప్రతి సరుకు ధర కిలో కనీసం రూ.40 నుంచి రూ.60 వరకు పెరిగింది. కిలో కందిపప్పు గత ఏడాది రూ.80 ఉండగా ప్రస్తుతం రూ.210కు చేరింది. కిలో శనగపప్పు రూ.70 నుంచి ప్రస్తుతం రూ.120 పెరిగింది. ధరలు పెరిగాయని కొనుగోలు చేయకుండా ఉండలేమని అప్పోసప్పో చేసి తెచ్చుకోక తప్పడం లేదని తాటిచెట్లపాలేనికి చెందిన ఓ కూలి ఆవేదన వ్యక్తపరిచాడు.

ప్రస్తుతం ధరలు (కిలో రూపాయల్లో)

కందిపప్పు రూ.210, శనగపప్పు రూ.120, శనగపిండి రూ.124, మినపపప్పు రూ.190, పెసరపప్పు రూ.170, గోధుమ పిండి రూ.65, మైదాపిండి రూ.66, గోధుమ రవ్వ రూ.70, బెల్లం రూ.110, పంచదార రూ.60, చింతపండు రూ.200గా ఉన్నాయి.

ఆయిల్స్

ఫ్రీడమ్ రిఫైనరీ లీటర్ రూ.170, సూపర్ డ్రాప్ రూ.165, గోల్డ్ డ్రాప్ రూ.140, పామాయిల్ రూ.120, వేరుశనగ నూనె రూ.260గా ఉన్నాయి.

పెరిగిన బియ్యం ధరలు

పప్పులు, వంట నూనెలు ధరలు మాత్రమే కాదు నిత్యం అందరూ వినియోగించే బియ్యం ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. గత ఏడాదితో పోలిస్తే 25 కిలోల బస్తాపై రూ.250 నుంచి రూ.350 వరకు పెరిగాయి. లలిత రూ.1560, డైమండ్ రూ.1560, సమీర్ రూ.1780, ఆవుదూడ రూ.1700గా ఉన్నాయి.

కూరగాయల ధరలు పైపైకి

మార్కెట్‌లో కూరగాయల ధరలు కూడా బాగా పెరిగాయి. ఉల్లిపాయలు

మిగతా 2లో..

ఎస్‌బిఐ సొమ్ముతో సంబరాలా?

- కేంద్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేయాలి
- బిజెపి ఎంపీ జివిఎల్ అక్రమ చర్యలను ఖండించిన సిపిఎం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సొమ్ముతో బిజెపి ఎంపీ జివిఎల్ నరసింహారావు సంక్రాంతి సంబరాలు నిర్వహించటాన్ని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తీవ్రంగా ఖండించారు. దీనిపై ఎస్‌బిఐ అధికారులు తక్షణమే ప్రజలకు సమాధానం చెప్పాలని, కేంద్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. తన రాజకీయ లబ్ధికోసం బిజెపి రాజ్యసభ సభ్యుడు జివిఎల్ నరసింహారావు ఎస్‌బిఐ సిఎస్‌ఆర్ నిధులను సంక్రాంతి సంబరాలు పేర దుర్వినియోగం చేయడాన్ని ప్రజలు తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో జివిఎల్ నరసింహారావు 4 రోజులు పాటు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సంబరాలు నిర్వాహణకు అయ్యే మొత్తం ఖర్చును ఎస్‌బిఐ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి రూ.లక్షల్లో అక్రమంగా దొడ్డి దారిన ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం విద్య, వైద్యం, ప్రజల అత్యవసర అవసరాలు, ప్రజా సంక్షేమానికి ఇటువంటి నిధులు వినియోగించాలని తెలిపారు. అధికారులను బెదిరించి తమ రాజకీయ స్వార్థ ప్రయోజనం కోసం సిఎస్‌ఆర్ నిధులను బిజెపి వినియోగించటం పెద్ద రాజకీయ అవినీతి చర్యగా అభివర్ణించారు. స్టీల్‌ప్లాంట్, హెచ్‌పిసిఎల్, విశాఖ పోర్టు, ఎల్‌ఐసి, ఎన్‌టిపిసి తదితర అనేక ప్రభుత్వ సంస్థల సిఎస్‌ఆర్ నిధులను బలవంతంగా తమ పార్టీ, అర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థల విస్తరణ కోసం బిజెపి వినియోగిస్తోందని, నిబంధనలన్నింటినీ తుంగలో తొక్కుతోందని విమర్శించారు. ఎన్నికల బాండ్ల పేర లక్షల కోట్లు నిధులు అక్రమంగా కార్పొరేట్ సంస్థల నుంచి సేకరిస్తూ, అందుకు ప్రతిఫలంగా ప్రభుత్వరంగ సంస్థలను, సహజ వనరులను వారికి ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. గత కొంత కాలంగా జివిఎల్ విశాఖలో తిష్ట వేసి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను జిందాల్ వంటి కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయటానికి కోవర్టుగా పనిచేస్తున్నారని విమర్శించారు. రెండో వైపు రకరకాల వేషాలతో విశాఖ ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు ఏకంగా ఎస్‌బిఐ యొక్క సిఎస్‌ఆర్ నిధులను అక్రమంగా వినియోగించి, తెలుగు ప్రజలు పవిత్ర పండగగా భావించే సంక్రాంతిని అపవిత్రం చేశారని పేర్కొన్నారు. ఇలాగే దేశవ్యాప్తంగా పండుగలను బిజెపి మత విద్వేషాలకు, రాజకీయ స్వప్రయోజనాలకు వేదికగా ఉపయోగించు కుంటుందని విమర్శించారు. ఈ చర్యలపై విశాఖ ప్రజలు అప్రమతంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

విశాఖ విమానాశ్రయంలో ప్రయాణికుల ఆందోళన

వార్త మెయిన్‌లో..

మోడీని గద్దె దించితేనే దేశానికి మోక్షం

వార్త 2లో..

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జిఒ ప్రతుల దగ్ధం

వార్త 2లో..

ఆర్‌టిఎ అధికారుల దాడులు

38 ట్రావెల్ బస్సులపై కేసులు

వార్త 3లో..

శతశాతం ఉత్తీర్ణతకు కార్యాచరణ

- 'పది'లో వెనుకబడ్డ విద్యార్థులపై శ్రద్ధ'
- రోజూ ప్రత్యేక తరగతులు
- నిపుణులు తయారుచేసిన సిలబస్ అందజేత
- 'ప్రజాశక్తి'తో అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి కార్యాచరణ ప్రణాళిక తయారుచేశాం. డిస్ట్రిక్ట్ కామన్ ఎడ్యుకేషన్ బోర్డు ద్వారా నిపుణులు తయారుచేసిన పరీక్షల మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశాం. 50 రోజుల ప్రణాళికకు తగినట్లు కృషి ప్లాన్ అమలుచేస్తున్నాం. సబ్జెక్టుల టీచర్ల కొరత లేదు. పాఠ్యాంశాల బోధన పూర్తయింది. అని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ వివరించారు. ప్రజాశక్తి ముఖాముఖికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పది





ఉత్తీర్ణత, ప్రణాళిక వంటి పలు అంశాలను ఆమె తెలిపారు. ఆ ఇంటర్వ్యూ విషయాలు ఆమె మాటల్లోనే...

పది ఉత్తీర్ణతకు తీసుకున్న చర్యలేంటి?

మార్చిలో పది పరీక్షలు జరగనున్నాయి. 50 రోజుల ప్రణాళిక తయారుచేశాం. అందుకు తగినట్లు విద్యార్థులను తయారుచేస్తున్నాం. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

పది విద్యార్థులు ఎంతమంది ఉన్నారు?

జిల్లాలోని

మిగతా 2లో..



ఊరూరా భోగి పండుగ

వార్త 3లో..

మొదటి పేజీ తరువాయి..

ధరాఘాతం

కిలో రూ.35, టమోటా రూ.25, బెండకాయలు రూ.60, పచ్చిమిర్చి రూ.50, బంగాళదుంపలు రూ.30, అల్లం పాతది రూ.150, బీన్స్ రూ.50, క్యాప్సికం రూ.60, పొటల్స్ రూ.80, చిక్కుడుకాయలు రూ.50 ధర ఉండగా, వెల్లుల్లిపాయలు రూ.400 ధర ఉంది. దీంతో అన్ని తరగతుల ప్రజలు సంక్రాంతి వంటి ప్రధాన పండుగను ఉత్సాహంగా జరుపుకోవడానికి ధరల భారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

శతశాతం ఉత్తీర్ణతకు కార్యాచరణ

వివిధ ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని 405 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 13వేల మందికి పైగా విద్యార్థులున్నారు.

వెనుకబడిన విద్యార్థుల కోసం తీసుకున్న శ్రద్ధ?

వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. కృషి ప్రణాళిక ద్వారా ప్రతిరోజూ ఉదయం 8.15 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4.15 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

విద్యార్థులకు మెటీరియల్ ఇచ్చారా?

డిస్ట్రిక్ట్ కామన్ ఎడ్యుకేషన్ బోర్డ్ ద్వారా నిపుణులు తయారుచేసిన సిలబస్‌ను విద్యార్థులకు అందించాం. డిసెంబర్ నాటికి సిలబస్ పూర్తయింది. పరీక్షలకు విద్యార్థులతో రివిజన్ చేయిస్తున్నాం. తరగతుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక క్లాసులో పాఠ్యాంశాల నివృత్తి చేయిస్తున్నాం.

మోడీని గద్దె దించితేనే దేశానికి మోక్షం

సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్



జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్షలో కూర్చున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మోడీని గద్దె దించితేనే దేశానికి మోక్షం లభిస్తుందని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు ఆదివారం నాటికి 1018వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక దేవాలయాల్లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా తన అనుయాయులకు కట్టబెట్టాలని మోడీ చూస్తే కార్మిక వర్గం చూస్తూఊరుకోదన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు పరం కానివ్వబోమన్నారు. దీక్షల్లో సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు, ఆయన తల్లి ఆదిశేషమ్మ, భార్య సామ్రాజ్యం, నాయకులు ఒ.వి.రావు, జి.శ్రీనివాసరావు, నమ్మి రమణ, పి.నారాయణరావు, ఎ.శ్రీను, సిహెచ్.రాముడు, శశిభూషణ్, ఎస్.హైదిరాజు, సిహెచ్.హైదిరాజు, ఎస్‌కె.సఫీ, ఎం.సోమేష్, వి.అప్పారావు, ఎన్.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం నాయకులు

ముస్లిములకు ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్/సీతమ్మధార : వచ్చే ఎన్నికల్లో ముస్లిములకు ప్రాధాన్యతను ఇచ్చి ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని 'వాయిస్ ఆఫ్ ముస్లిమ్స్' కమిటీ డిమాండ్ చేసింది. దక్షిణ నియోజకవర్గం రైల్వే న్యూ కాలనీలోని సింకా గ్రాండ్‌లో ముస్లిం నేత హైదర్ ఆలీ సింకా అధ్యక్షతన వాయిస్ ఆఫ్ ముస్లిమ్స్ ఆధ్వర్యాన ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఏపిలోని అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికలలో ముస్లిములకు సీట్లు కేటాయించకుండా అన్యాయం చేస్తున్నాయన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి శ్రీకాకుళం జిల్లా వరకు ఉన్న 67 నియోజకవర్గాలలో ముస్లిములు పెద్ద సంఖ్యలో ఉన్నారని తెలిపారు. రాజకీయ పార్టీలు ముస్లిములకు సీట్లు కేటాయించకుండా, వారిని ఓటు బ్యాంకుగా చూస్తూ చిన్న చూపు చూస్తున్నాయని విమర్శించారు. రానున్న ఎన్నికలలో ముస్లిములకు సీట్లు కేటాయించే రాజకీయ పార్టీలకు మాత్రమే మద్దతు ఇస్తామని, ఆ పార్టీల అభ్యర్థులను గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించని పక్షంలో ముస్లిములు ఇండిపెండెంట్లుగా ఎన్నికలలో పోటీ చేస్తారని స్పష్టంచేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో న్యాయవాది షేక్ షరీఫ్, రహమతుల్లా బేగ్, షేక్ మునీర్, షేక్ అహ్మద్ వలి, హైదర్ ఆలీ సింకా, ముజీబుర్ రహ్మాన్, అమీర్జాన్, షేక్ నూర్ అహ్మద్, పలు మసీదుల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

జగన్‌పై ఉన్నన్ని కేసులు ఎవరిపైనా లేవు

- మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎపి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై ఉన్నన్ని కేసులు ప్రపంచంలో ఎవరిపైనా లేవని మాజీ ఎమ్మెల్యే, దక్షిణ టిడిపి ఇన్‌ఛార్జి గండి బాబ్జి అన్నారు. టిడిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జగన్‌పై ఉన్న కేసుల్లో ఏ ఒక్క దానిలో శిక్షపడినా పదేళ్ల జైల్లో ఉంటారని తెలిపారు. మోడీ ఓడిపోతే మొదట జైలుకు వెళ్లేది జగన్ అన్నారు. పులివెందులలో బిటెక్ రవి పోటీచేయడానికి సిద్ధమైతే అతడిని హత్య చేయడానికి కుట్రచేస్తున్నారని ఆరోపించారు. జగన్‌పై కేసులన్నీ ట్రైల్‌కు వచ్చేశాయని తెలిపారు. ఇప్పటి వరకూ 3,600 వాయిదాలు తీసుకున్నారన్నారు. కోర్టులు ఒక షెడ్యూల్ ఖరారు చేసి సాక్షులను ప్రవేశపెట్టమనే పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

కెవిపిఎస్ కేలండర్ ఆవిష్కరణ



కెవిపిఎస్ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సుబ్బన్న, చిరంజీవి తదితరులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కెవిపిఎస్ 2024 కేలండర్‌ను జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బన్న ఆధ్వర్యాన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ నాయకులు టి.చిరంజీవి మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగాయన్నారు. దీన్ని దళితులందరూ కలిసికట్టుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. దళిత నాయకులు కె.అప్పారావు మాట్లాడుతూ, అన్ని వర్గాల తరగతులు కలిసి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు, ఎంవి.ప్రసాదరావు, ఎం.ఈశ్వరరావు, పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ మార్కెట్‌లో కియా కొత్త సోనెట్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : భారతదేశపు అగ్రగామి ప్రీమియం కార్‌మేకర్ కియా, దాని అత్యంత ప్రీమియం కాంపాక్ట్ ఎస్‌యూవీ - న్యూ సోనెట్‌ను ఆదివారం విశాఖ మార్కెట్‌లో ప్రవేశపెట్టింది. విశాఖలోని కియా షో రూమ్‌లో కియా ఇండియా చీఫ్ సేల్స్ అండ్ బిజినెస్ స్ట్రాటజీ ఆఫీసర్ మ్యూంగ్-సిక్ సోహ్న్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ నూతన కారు 25 భద్రతా లక్షణాలను కలిగి ఉందని, ఇందులో 10 స్వయం ప్రతిపత్తి ఫీచర్లు, 15 హై-సేఫ్టీ ఫీచర్లు ఉన్నాయని తెలిపారు. ఈ వాహనం 70కి పైగా కనెక్ట్ చేయబడిన కార్ ఫీచర్లను కలిగి, 5 డీజిల్ మాన్యువల్ వేరియంట్‌లతో సహా 19 విభిన్న వేరియంట్‌లతో అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ కొత్త సోనెట్ రూ.7.99 లక్షల (ఎక్స్-షోరూమ్) నుంచి ప్రారంభ ధరతో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జిఒ ప్రతుల దగ్ధం




ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జిఒ ప్రతులను దగ్ధం చేస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జిఒలను న్యాయవాదులు భోగిమంటల్లో వేసి దగ్ధం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను నిరసిస్తూ విశాఖ బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు 27వ రోజు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, న్యాయవాది పలక శ్రీరామమూర్తి, 15 మంది న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ, భూహక్కు చట్టం అమలులోకి వస్తే భూమికి సంబంధించిన వివాదాల్లో న్యాయస్థానాల ప్రమేయం ఉండదని, ఇది రాజ్యాంగ వ్యతిరేకం అని చెప్పారు. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పండగలు ఐక్యతకు ప్రతిరూపాలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నెహ్రూ యువ కేంద్ర, గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో ప్రకృతి చికిత్సాలయం ఆవరణలో చిన్నారులకు సామూహిక భోగి పండ్లు పోసే కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శిష్ట్లా శ్రీలక్ష్మి ముందుగా చిన్నారులకు, బొమ్మలకు హారతులు ఇచ్చి భోగి పండ్లు పోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేశమంతా ఈ పండుగను వివిధ నామాలతో చేసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ, ఎస్.మహేష్, శిష్ట్లా చాతుర్య, ఎస్ ప్రభావతి, ఎస్.కామేశ్వరి, రూపాకుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



పతంగుల ఎగురవేత

భోగి పండగ సందర్భంగా విశాఖ ఆర్‌కె బీచ్‌లో పతంగులను ప్రజలు ఎగురవేసి ఆనందంగా గడిపారు. నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన పిల్లలు, యువకులు, పెద్దలు ఆదివారం సాయంత్రం ఆర్‌కె.బీచ్‌కు చేరుకొని గాలి పటాలను ఎగురవేస్తూ సందడి చేశారు. చిన్న గాలి పటాలు, పెద్ద గాలిపటాలను ఎగురవేస్తూ పిల్లలు కేరింతలు కొట్టారు.



భోగి పండుగ వేడుకల్లో కె.కె.రాజు

ఊరూరా భోగి పండుగ సందడి

భీమునిపట్నం : మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఆనందోత్సాహాల నడుమ భోగి సంబరాలను జరుపుకున్నారు ప్రతి వీధిలోనూ పిల్లలు, పెద్దలు తేడా లేకుండా భోగి మంటలు వద్ద సందడి చేశారు. భీమిలి మండలం, సింగనబంద పంచాయతీ కృష్ణంరాజు పేట ఎంపి ప్రాథమికో న్నత పాఠశాలలో హెచ్ఎం జి సత్యనారాయణ ఆధ్వర్యాన భోగి పండుగలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు

ఆనందపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం భోగిపండుగను ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున భోగిమంటలు వేశారు. గంగిరెద్దులు, బసవన్నలు సందడి చేశాయి. మహిళలకు ముగ్గుల పోటీలు యువతకు క్రికెట్,వాలీబాల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.తర్లువాడలో బిఆర్‌బి నాయుడు, తాత్రాజు అప్పారావు , బి రాజు ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు.

సింహాచలం :సింహాచలం కొండపై దేవస్థానం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి స్వామి ఆదివారం



భోగి మంట చుట్టూ సందడి చేస్తున్న నగర వాసులు

ప్రారంభించారు. దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామి, ఇఒ శ్రీనివాసమూర్తితో కలిసి భోగి మంటల్లో పిడకలు వేసారు. అనంతరం సింహాచలం వరాహలక్ష్మీ నర్సింహస్వామిని దర్శించుకున్నారు. శారదాపీఠం తరపున భక్తులకు సంక్రాంతి శుభాశీస్సులు అందించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు వారణాసి దినేష్ రాజ్, గంట్ల శ్రీనుబాబు పాల్గొన్నారు

మునగపాక : మండలంలోని నాగులపల్లిలో చంద్రశేఖర మహాస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఆదివారం భోగి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ధ్యాన గురువు సుజాత ఆధ్వర్యంలో చిన్నపిల్లలతో భరతనాట్యం, మహిళలతో నృత్య ప్రదర్శన, వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ విష్ణుమూర్తిచే అన్నమయ్య సంకీర్తనల ఆలాపన చేశారు. గోదాదేవి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్ కరస్పాండెంట్ సేసెట్టి గిరీష్ కుమార్, సంఘ సేవకులు కాండ్రేగుల చందు, ఎంతఊడ సూర్యారావు, పిల్ల శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



నగరంలోని ఒక వీధిలో అడుగడుగునా భోగి మంటలు

ప్రజాశక్తి- సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయం వద్ద పార్టీ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె రాజు ఆధ్వర్యంలో భోగి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగ కెకె రాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సంక్రాంతి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకో వాలని, సిఎం జగన్ పాలనలో రాష్ట్రం మరింత పురోభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఉత్తర నియోజకవర్గ ప్రజలకు, వైసిపి కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, 14వ వార్డు కార్పొరేటర్ అనిల్‌కుమార్ రాజు, కెవిఎన్ శశికళ, స్టాండింగ్ కమిటీ సభ్యులు సేనాపతి అప్పారావు, వైసిపి నేతలు నీలి రవి, పైడి రమణ, అమర్ రెడ్డి, హరి పట్నాయక్, బొడ్డేటి గంగా మహేష్, ఐ.రవికుమార్, కె చిన్న, బొడ్డేటి కిరణ్, నూకరాజు, శేషు, కృపారావులు పాల్గొన్నారు.

సీతమ్మధార : నగరంలోని మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లో వైసిపి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో భోగి సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగిపంటలు వేసి, పిల్లలకు తలపై రేగు పళ్లు వేసి ఆశీర్వదించారు డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, పేడాడ రమణకుమారి, జోనల్ కమిషనర్ సింహాచలం, వైశాఖి స్పోర్ట్స్ పార్క్ ప్రెసిడెంట్ ససపల వరప్రసాద్, సెక్రెటరీ పొట్టునూరి నాగరాజు, కృష్ణారావు, ఎం.లక్ష్మి, సీపాన రాము, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



జెసిబితో తొలగించిన ప్రహరీ

ప్రభుత్వ భూమిలో ఆక్రమణ తొలగింపు

స్థానికుల ఫిర్యాదుకు జాయింట్ కలెక్టర్ స్పందన

ప్రజాశక్తి-పెందుర్తి :మండలం రాంపురం పంచాయతీలో ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను రెవెన్యూ అధికారులు ఆదివారం తొలగించారు. పెందుర్తి రాంపురం హైవేను అనుకుని సర్వే నెంబరు 29, 30లో రూ.కోట్లు విలువచేసే సుమారు 70 సెంట్లు స్థలాన్ని కోట్లు విలువచేసే ప్రభుత్వ భూములను ఎమ్మెల్యే అండదండలతో స్థానిక వైసిపి నాయకుడు ఆక్రమించుకుంటున్నాడని రాంపురానికి చెందిన అధికార పార్టీ ఉపసర్పంచ్ లెక్కల కిషోర్‌కుమార్, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో, జెసి స్పందించి తగు చర్యలకు ఆదేశించడంతో ప్రభుత్వ భూమిలో సరిహద్దులుగా ఏర్పాటు చేసిన ప్రహరీని ఆర్ఐ, విఆర్ఒ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బందితో జెసిబితో కూల్చేశారు. రాంపురంలో ప్రభుత్వ భూమి ఆక్రమణపై స్థానిక రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడం, స్థానిక విఆర్ఒ దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో ఈ వ్యవహారంలో వారి సహకారం ఉందన్న అనుమానంతో జెసి విశ్వనాథన్‌కు ఫిర్యాదు చేయడంతోపాటు విషయాన్ని స్థానిక మీడియా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లోనే ఆక్రమణలపై చర్యలు చేపట్టారని స్థానికులతోపాటు ఫిర్యాదుదారులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వభూమిని పూర్తిస్థాయిలో పరిరక్షించాలని కోరుతున్నారు.



భోగిమంటల్లో జీవో కాపీలు వేస్తున్న బుద్ద నాగజగదీష్

భోగి మంటల్లో జిఒ ప్రతుల దగ్ధం

వైసిపి ప్రభుత్వ తీరుకు టిడిపి నిరసన

ప్రజాశక్తి- అనకాపల్లి:వైసిపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలు చేస్తూ జారీచేసిన జీవోల ప్రతులను ఆదివారం తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కార్యాలయం ముందు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసనమండలి సభ్యులు బుద్ద నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ పట్టణ అధ్యక్షులు డాక్టర్ నారాయణరావుతో కలిసి భోగి మంటల్లో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాగ జగదీష్ మాట్లాడుతూ, జీవో 1 తీసుకొచ్చి రోడ్లపై సభలు, సమావేశాలు నిర్వహించకుండా అడ్డుకున్నార్నారు. పట్టణ శాఖ అధ్యక్షులు డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ, జగన్ రెడ్డి నియంతృత్వ పాలనతో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, కోట్ని రామకృష్ణ, కుప్పిలి జగన్మోహన్, బోడి వెంకట్రావు, మల్ల గణేష్ పాల్గొన్నారు.

అచ్యుతాపురం:పూడిమడక గ్రామంలో ఎలమంచిలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు ప్రభుత్వ జీవో కాపీలను భోగి మంటలలో వేసి దగ్ధం చేశారు. టిడిపి సీనియర్ నాయకులు మెరుగు బాపు నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి లాలం నాగేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు మేరుగు వెంకట్రావు, యాంద్ర అప్పలనాయుడు, నాయుడు బాబు, సమ్మింగ లక్ష్మణ పాల్గొన్నారు.

అచ్యుతాపురం:తిమ్మరాజుపేట, జగ్గంపేట గ్రామాలలో జీవో కాపీలను టిడిపి నాయకులు భోగి మంటలలో వేసి తగలబెట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యలక్ష్మి, శివ బాబు నాయుడు, పార్టీ జిల్లా సెల్ అధికార ప్రతినిధి కర్రి ఆదిబాబు, గ్రామ అధ్యక్షుడు మళ్ళ చినబాబు, మండల నాయకుడు కర్రి నాయుడు, ప్రధాన కార్యదర్శి కర్రి భద్రరాజులు, ప్రచార కమిటీ చైర్మన్ కర్రి వెంకు నాయుడు, వెలగ అచ్చు నాయుడు పాల్గొన్నారు.

వడ్డాది:: తెదేపా ఇంచార్జ్ బత్తుల తాతయ్య బాబు ఆధ్వర్యంలో మండలంలోని బంగారు మెట్ట జంక్షన్లో భోగి మంటలు వేసి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. మద్యం, ఇసుక, భూముల్లో జగన్ దోపిడీకి పాల్పడుతున్నాడని విమర్శించారు.జీవో కాపీలను భోగిమంటలలో వేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గోకవాడ కోటేశ్వరరావు, డొంకిన



భోగిమంటల్లో జీవో కాపీలు దగ్ధం చేస్తున్న తాతయ్యబాబు

అప్పలనాయుడు, సాయం శేషు, దొండ రమేష్, దొండ నరేష్, సింగంపల్లి రమేష్, సిరిగిరి శెట్టి శ్రీరామమూర్తి, గొన్నాబత్తుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చీడికాడ:జగన్మోహన్ రెడ్డి తప్పుడు లెక్కలు చూపించి రాష్ట్ర ప్రజలను మెప్పిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు విమర్శించారు.జి కొత్తపల్లి గ్రామంలో భోగి మంటలు వేసి నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రం అధోగతి పాలు అయ్యిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్లి సూరి నాయుడు, ఎంపిటిసిలు దారపు పెద్దనాయుడు, కోటేశ్వరరావు, పైలా ముత్యాల నాయుడు, గాడి నాగ రత్నం ప్రసాద్ పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

కోడి పందేల శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, చిప్పాడ గ్రామం కల్లాలలో కోడి పందేల శిబిరంపై భీమిలి పోలీసులు ఆదివారం ఆకస్మికంగా దాడి చేశారు. ఎస్ఐ జి హరీష్ ఆధ్వర్యంలో సిబ్బంది చేపట్టిన దాడిలో ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 4 కోళ్లు, రూ 1600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ డి.రమేష్ తెలిపారు. ఎస్ఐ హరీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంక్రాంతి, కనుమ సందర్భంగా పేకాట, కోడి పందేల వంటి జూదాలను నిర్వహించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు పేకాట, కోడి పందేలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, నారాయణరాజుపేటలో బహిరంగ ప్రదేశంలో ఆదివారం పేకాట శిబిరంపై భీమిలి పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. అందిన సమాచారం మేరకు నారాయణ రాజు పేటలో బహిరంగ ప్రదేశంలో పేకాట శిబిరంపై సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామని భీమిలి ఎస్ఐ జి హరీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఐదుగురు జూదరులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ 2,650 లు పేకముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరీష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ప్రజాశక్తి- పెందుర్తి : 98వ వార్డు అప్పన్నపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళా దుర్మరణం చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలివి. అప్పన్నపాలెం వద్ద మార్కెట్‌కు వెళుతున్న గొలగాని అప్పలకొండ(57) అనే మహిళ రోడ్డు దాటుతుండగా వేపగుంట నుండి సింహాచలం వెళ్లే ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో తలకు దెబ్బ తగిలి అధిక రక్తస్రావమై అక్కడికక్కడే మతి చెందింది .స్థానికులు 108 వాహనానికి, పోలీసులు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు

ఆర్‌టిఎ అధికారుల దాడులు

- 38 ప్రైవేటు ట్రావెల్ బస్సులపై కేసులు

- రూ.4.38లక్షల జరిమానా వసూలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికుల నుంచి అధికమొత్తంలో ఛార్జీలు వసూలు చేసి అక్రమాలకు పాల్పడిన ప్రైవేట్ ట్రావెల్ బస్సులపై రవాణా శాఖ కొరడా ఝుళిపించారు. రవాణాశాఖ అధికారి హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఉదయం 4 గంటల నుంచి అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి, 38 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు పై మెరుపు దాడి చేశారు.38 ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు చేసి, రూ.4,38,000 జరిమానా విధించారు.

ప్రయాణ రద్దీని దష్టిలో ఉంచుకొని ప్రైవేట్ బస్సుల నిర్వాహకులు ప్రయాణికుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారని, సరైన రికార్డులు లేకుండా బస్సులు నడుపుతున్నారని సమాచారంతో ఈ దాడులు చేస్తున్నట్లు రవాణాశాఖ అధికారులు వెల్లడించారు. చేసి జరిమానా విధించారు. పండుగ మూడు రోజులూ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

భక్తులతో పోటెత్తిన సింహగిరి

ప్రజాశక్తి- సింహాచలం : భోగి పర్వదినం కావడంతో సింహగిరి భక్తులతో కిటకిటలాడింది. గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి స్వామికి తొలి పంటను సమర్పించి సేవ గరిడితో ఆనవాయితీగా మొక్కులు చెల్లించుకున్నారు సింహాద్రి అప్పన్నను దర్శించుకునేందుకు బైక్‌లు, ఇతర వాహనాల్లో పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో ఘాట్‌రోడ్డులోనూ, కొండపై ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడింది. గోపాలపట్నం పోలీసులు, దేవస్థానం సిబ్బంది సకాలంలో స్పందించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారుభక్తుల రద్దీ కారణంగా స్వామి అంతరాలయ దర్శనాలు నిలిపివేశారు.

ఏళ్లు గడుస్తున్నా... నిర్మాణం కాని స్పోర్ట్స్ కాంప్లెక్స్

నిరాశలో క్రీడాకారులు

ప్రజాశక్తి -గాజువాక

గాజువాక నియోజవర్గం మొత్తానికి ఏడు ఎకరాల విస్తీర్ణంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని 1999వ సంవత్సరం నుంచి ప్రణాళిక తయారుచేస్తున్నారు తప్ప, నేటికీ నిర్మాణం చేపట్టలేదు. ఇప్పటికి నలుగురు ఎమ్మెల్యేలు మారారు. ప్రతిపాదనలు ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది. వైసిపి ప్రభుత్వంలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు గెలిచిన నెల రోజుల్లోనే క్రీడామంత్రి హోదాలో మాట్లాడుతూ, ఏడాదిలో దీని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన మంత్రి పదవి కాలం పూర్తయినా నిర్మాణానికి నోచుకోలేదు. 2004వ సంవత్సరంలో హెచ్‌పిసిఎల్ యాజమాన్యం సిఎస్ఆర్ నిధులనుంచి రూ.ఏడు కోట్లు కేటాయించింది. పాలకులు శ్రద్ధ చూపకపోవడంతో హెచ్‌పిసిఎల్ యాజమాన్యం ఆ నిధులను వెనక్కి తీసుకుంది. రాష్ట్రంలోనే గాజువాక నియోజవర్గం తలసరి ఆదాయంలో ప్రథమ స్థానంలో ఉందని చెబుతారు. గాజువాక నియోజకవర్గం జనాభా కూడా ఎక్కువగానే ఉన్నారు. క్రీడాకారులూ ఎక్కువగానే ఉన్నారు. గాజువాక నుంచి క్రికెట్ మ్యాచ్ సెలెక్ట్ అయిన వ్యక్తి కూడా ఉన్నారని విషయం తెలిసిందే. అయినా గాజువాకలో ఒక క్రీడా మైదానం కూడా లేకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఈ మైదానం ఎన్నిక హామీగా మిగిలిపోతుంది తప్ప నెరవేరిన సందర్భంగా కనిపించడం లేదు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం జరిగితే స్థానిక క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎప్పటినుంచో క్రీడాకారులు ఎదురుచూస్తున్నారు. కానీ ఇంతవరకు దీని సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి కదిలికి రాలేదు. నాలుగు సార్లు శంకుస్థాపన చేశారు తప్ప పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ప్రస్తుతం ప్రహరీ కూడా శిథిలావస్థకు చేరుకుంది. రాత్రి సమయంలో మైదానంలోపలకు వెళ్లడానికి వీలుగా ఉండడంతో, మందుబాబులకు నిలయంగా తయారయింది. రాత్రి సమయంలో మద్యం తాగి ఖాళీ సీసాలు గ్రౌండ్లో విసిరివేయడంతో, ఉదయం వాకింగ్‌కు వెళ్లే వారి కాళ్లకు తగిలి గాయాలపాలవుతున్నారు. దీన్ని వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాను

స్పోర్ట్స్ కాంప్లెక్స్ గురించి చాలాసార్లు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాను. బడ్జెట్‌లో నిధులు తక్కువ ఉండడంతో కేటాయించలేకపోయారు.



తిప్పల నాగిరెడ్డి
గాజువాక ఎమ్మెల్యే

ఎన్నికల కోడ్‌తో ఆగింది

టిడిపి హయాంలో పూర్తి కావలసి ఉంది. ఎన్నికల కోడ్ రావడంతో ఆగింది. ఆ మైదానానికి అడ్డంగా ఉన్న ఆదర్శ స్కూల్‌ను వేరే ప్రాంతానికి తరలించే ప్రయత్నం నేనే చేశాను. గాజువాక ఆదర్శ గ్రౌండ్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం జరగాలి.



పల్లా శ్రీనివాసరావు
గాజువాక మాజీ ఎమ్మెల్యే



స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం జరగాల్సిన స్థలం ఇదే...

నిర్వహణలో నిర్లక్ష్యం..

- నిరుపయోగంగా ఫైబర్ మరుగుదొడ్లు
- రన్నింగ్ వాటర్ సదుపాయం లేక మూలకు..
- అపరిశుభ్రతకు నెలవై వినియోగానికి దూరం
- అటకెక్కిన స్వచ్ఛ భారత్ లక్ష్యం



తగరపువలస శివాలయం వద్ద నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

ప్రజాశక్తి -తగరపువలస

"ప్రతి అడుగు - పరిశుభ్రత వైపు" అనే నినాదం ఆచరణలో ఎక్కడా కనబడని పరిస్థితి. స్వచ్ఛభారత్‌లో భాగంగా పలుచోట్ల ఏర్పాటుచేసిన ఫైబర్ మరుగుదొడ్లుతో పాటు సాధారణ మరుగుదొడ్లు కూడా రన్నింగ్ వాటర్ సదుపాయం లేక, అపరిశుభ్రంగా మారి చివరకు వినియోగానికి దూరమయ్యాయి. వీటిని ప్రారంభించడంలో ఉన్న హడావిడి, ఆర్భాటం, తర్వాత నిర్వహణలో ఏమాత్రమూ శ్రద్ధ చూపకపోవడం, మరో వైపు పర్యవేక్షణ కొరవడడం, అధికారుల చిత్త శుద్ధి లేమి, ప్రజల్లో అవగాహన లేక పోవడం ఇలా అనేక కారణాలతో మరుగుదొడ్లు ఏర్పాటు లక్ష్యం నెరవేరలేదనే చెప్పాలి.

స్థానిక శివాలయం ఎదురుగా 8 ఫైబర్ మరుగుదొడ్లు రన్నింగ్ వాటర్ సదుపాయం లేక నిరుపయోగంగా మారాయి. కొందరు ఎత్తి తెచ్చుకున్న నీటితో వీటిని వాడడం వల్ల అపరిశుభ్రమై, చివరకు వాడుకలేని పరిస్థితి ఉంది. దీంతో అనివార్యంగా ఇవి నిరుపయోగంగా మారాయి. వీటి వల్ల పరిసరాలు కూడా అధ్వానంగా తయారయ్యాయి.

జివిఎంసి ఒకటో వార్డు రామన్నపేట తుపాను రక్షిత భవనానికి దగ్గర్లో గతంలో నిర్మించిన సామాజిక మరుగు దొడ్లు రన్నింగ్ వాటర్ సదుపాయం లేక నిరుపయోగంగా మారాయి. అంతే కాకుండా అపరిశుభ్రతకు నెలవై వినియోగానికి దూరంగా ఉన్నాయి. దీంతో మరుగుదొడ్ల సదుపాయం లేక ముఖ్యంగా స్థానిక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. లక్షలు ఖర్చు చేసి నిర్మించిన మరుగుదొడ్లను మరమ్మతు పనులు చేసి వినియోగంలోకి తేవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.



రామన్నపేటలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

లక్ష్యానికి దూరంగా ఉపాధి

- రోజు వేతనం రూ.272 కాగా రూ.260 లభ్యత
- ఏడాదిలో 2 లక్షలా 20 వేల పని దినాలు కల్పన లక్ష్యం
- లక్షా 59 వేల పని దినాలు కల్పన
- విధుల్లో ఒత్తిడికి గురవుతున్న క్షేత్ర సహాయకులు

ప్రజాశక్తి -భీమునిపట్నం

వలసల నివారణకు ఉద్దేశించి ప్రారంభించిన మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యాల సాధనలో ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించడం లేదనే చెప్పాలి. ఇందుకు కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని చెప్పక తప్పదు. భీమునిపట్నం మండలంలో 2023 ఏప్రిల్ నుంచి అదే ఏడాది మార్చి వరకు 2 లక్షలా 20 వేల పని దినాలు కల్పన లక్ష్యం కాగా, లక్షా 59 వేల పని దినాలు కల్పించారు. మండలంలో 5 వేల జాబ్ కార్డులు ఉండగా, 1400 మంది కూలీలు పని చేస్తున్నారు. వీరంతా చెరువుల్లో మట్టి తవ్వకం, సాగునీటి కాల్వల పనులు, మొక్కల పెంపకం లాంటి పనులు చేస్తున్నారు. మరికొంత మంది కూలీలు జగనన్న ఇళ్ల నిర్మాణం పనులను చేస్తూ ఎన్ఆర్ఇజిఎస్ కింద మస్తరు వేయించుకొని వేతనం పొందుతున్నారు. ఇలా పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యాన జరిగే అభివృద్ధి పనుల్లో కూడా ఉపాధి హామీ చట్టం కింద వేతనం పొందుతున్నారు.



భీమిలి మండలం సింగన బందలో ఉపాధి పనిలో కూలీలు

పని ఒత్తిడిలో ఫీల్డ్ అసిస్టెంట్లు

ఫీల్డ్ అసిస్టెంట్లు విధుల్లో తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారు. 16 పంచాయతీలకుగానూ 14 పంచాయతీల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయి. 15 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరే పనులు పర్య వేక్షిస్తారు. ఏడు రిజిస్టర్లు నిర్వహిస్తున్నారు. కూలిపనికి వచ్చేటప్పుడు, వెళ్ళేటప్పుడు ఎన్ఎంఎంఎస్ యాప్ (నేషనల్ మొబైల్ మోనటరింగ్ సిస్టం) ద్వారా హాజరు వేస్తారు. మాన్యువల్‌గా కూడా రిజిష్టర్‌లో హాజరు వేస్తారు. ఎక్కడెక్కడ స్థిరాస్తులు ఎన్ని ఉన్నవీ వీరే గుర్తిస్తారు. ఏడాదికి ఒక కుటుంబానికి వంద రోజులు పని కల్పించే భాధ్యత కూడా వీరిదే. అయితే ఇప్పటి వరకు 140 మందికి ఏడాదికి 100 రోజులు పని కల్పించగలిగారు. ఇంతకీ వీరికి నెలకు ఇచ్చే వేతనం రూ.10 వేలుతో కుటుంబ పోషణ కష్టమనే చెప్పాలి. తమకు వేతనాలు పెంచాలని, ఫిక్సడ్ టెన్యూర్ ఎంప్లాయ్ (ఎఫ్‌టిఇ) గా గుర్తించాలని, మ్యాన్ డేస్ పని విధానం రద్దుచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మేట్ ల పరిస్తితి మరీ దారుణం

కొలతలు వేయడం, వాటిని క్యూబిక్ మీటర్లలో లెక్కించడం, మస్టరు వేయించడం ఇలా ఫీల్డ్ అసిస్టెంట్లకు సహాయకులుగా ఉండే మేట్‌లకు ఎటువంటి వేతనాలూ లేవు. రెండేళ్ల క్రితం వరకూ కూలితో పాటు వారానికి వేతనం లెక్క కట్టి ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మండలంలో ప్రస్తుతం 60 మంది మేట్‌లు పని చేస్తున్నారు.

రోజు వేతనం రూ.260

ఉపాధి కూలీ రోజు వేతనం రూ.272గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే నేల స్వభావం, మట్టి గట్టిగా ఉండడం లాంటి కారణాల వల్ల రూ.260 లభిస్తోంది.

రెడీమేడ్‌గా ఇంటి రుచులు..!

- హోంఫుడ్స్, స్వీట్ దుకాణాలకు పెరిగిన తాకిడి
- సొంతింటి వంటకాలు విశాఖలో తగ్గుముఖం



ద్వారకానగర్‌లోని ఓ స్వీట్ షాపులో సాగుతున్న పిండి వంటల అమ్మకాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగరంలో రెడీమేడ్ వంటకాల హవా క్రమేపీ పెరుగుతోంది. సంక్రాంతి వంటి పండగ వేళల్లోనూ రెడీమేడ్ రుచులపైనే నగర వాసులు ఆసక్తి కనబరుస్తున్నారు. ధరలు పెరగడం, తయారీ పద్ధతులు తెలియకపోవడం, పని ఒత్తిళ్లు వంటివి దీనికి కారణాలుగా చెప్పొచ్చు.

సంక్రాంతి వచ్చిందంటే వారం ముందు నుంచీ వంటింట్లో ఒకటే సందడి. ఒకప్పుడు ఇంట్లో ఉన్న పెద్ద వాళ్లు పండగకు వచ్చే బంధువులు, కొత్త అల్లుళ్ల కోసం పిండి వంటలు సిద్ధం చేయడంలో బిజీగా ఉండేవారు. అరెసెలు, జంతికలు, పాకుండలు, బూరెలు, సున్నుండలు, పొంగడాలు, గోరు మిటీలు, గులాబీ పువ్వులు, నువ్వుల ఉండలు వంటి వంటకాలతో ఇళ్లన్నీ ఘుమఘుమలాడేవి. వీటి తయారీలో తల్లికి కూతురు, అత్తకు కోడలు సహాయపడే సన్నివేశాలు చూడముచ్చటగా ఉండేవి. పండగలో పిండి వంటలు పెద్దలు ఎలా తయారు చేస్తున్నారో ఇంట్లో పిల్లలు గమనించేవారు. అయితే ఇదంతా గతం. మారుతున్న పరిస్థితులరీత్యా జీవన విధానంలోనూ మార్పులొచ్చాయి. యువత పిజ్జాలు, బర్గర్లు, పఫ్స్ అంటూ నూతన వంటకాలపై మక్కువ చూపుతున్నారు. దీంతో కొన్నిరకాల పిండి వంటలు కనుమరుగవుతున్నాయి. కొంతమంది యువకులకు పొంగడాలు, పాకుండలు, అరిసెలు అంటే తెలియని పరిస్థితి నెలకొందంటే అతిశయోక్తి కాదు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదల కూడా పండగ వంటపై పెను ప్రభావాన్నే చూపుతున్నాయి. మిఠాయిల్లో వాడే బెల్లం కిలో రూ.60 నుంచి రూ.70, పంచదార ధరలు రూ.50కిపైనే పలుకుతున్నాయి. వంటనూనెల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పిండి వంటలు తయారు చేసేందుకు ఉపయోగించే బియ్యం, శనగపిండి, మినప పప్పు, పెసరపప్పు వగైరా వాటితో పాటు వంటగ్యాస్ ధర కూడా భారీగా పెరిగింది. సాంకేతిక రంగాభివృద్ధిలో భాగంగా ఎస్ఎంఎస్‌లు, మెయిల్స్, వాట్సాప్‌లు అందుబాటులోకి రావడంతో అమ్మలక్కల పలకరింపులు, ముచ్చట్లు దూరం అయ్యాయి. పెరిగిన ధరలు, ఆర్థిక ఇబ్బందులు, సమయాభావం, సహాయకుల కరువు వంటి కారణాలతో పిండివంటల తయారీపై పల్లెల్లోనే పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఇక విశాఖపట్నం వంటి నగరంలో పరిస్థితి చెప్పనక్కర్లేదు. అంతా రెడీమేడ్ కల్చర్ నెలకొంది. స్వీట్స్, బేకరీల షాపుల్లో అప్పటికే తయారైన పదార్థాలను కొని తెచ్చుకుని పండగను చేసుకోవడం క్రమేపీ పెరుగుతోంది.

ధరలు ఇలా... (కిలో ఐటమ్ - రూపాయల్లో..)

చక్కెర పొంగలి - 400
పులిహోర - 300
పాకం గారెలు (ఒకటి) - 30
బూరెలు - 500
అరిసెలు - 400
కజ్జికాయలు - 300
ప్లెయిన్ గారెలు (ఒకటి)20
సున్నుండలు - .400
జంతికలు - 300
పొంగడాలు - 400
పాకుండలు - 400
గులాబీ పువ్వులు - 400

ఎక్కడ లభ్యమవుతున్నాయి ?

హోంఫుడ్స్, స్వగృహ, స్వీట్ సెంటర్లలో పిండి వంటలు లభ్యమవుతున్నాయి. గారెలు, బూరెలు, చక్కెర పొంగలి, పులిహోర, పాకం గారెలు, అరిసెలు వంటివి హోల్ సేల్ ధరల్లో లభ్యమవుతున్నాయి. పెద్ద మొత్తంలో ఆర్డర్లు చేసేవారి సౌకర్యార్థం డోర్ డెలివరీ సదుపాయాన్ని కూడా నిర్వాహకులు కల్పిస్తున్నారు. పండుగ సందర్భాల్లో పల్లె ప్రాంతాలకు వెళ్లలేని వారు, పిండి వంటల తయారీలో అవగాహన లేనివారు, పిండి వంటలకు అవసరమైన సామగ్రి అందుబాటులో లేనివారు, అన్నీ అందుబాటులో ఉన్నా తయారు చేసుకునే ఓపిక లేనివారు రెడీమేడ్ షాపులను ఆశ్రయిస్తున్నారు.

ప్రత్యేక కౌంటర్లు

నగరంలోని హోమ్ ఫుడ్స్, స్వీట్స్ దుకాణాల్లో పిండి వంటల విక్రయాల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు అమ్మకానికి సిద్ధంగా ఉన్న స్వీట్లును ఆకర్షణీయమైన ప్యాకింగుల్లో కొనుగోలుదారులకు అందజేస్తున్నారు. పెద్ద మొత్తాల్లో కావాల్సిన వారి నుంచి పది రోజుల ముంచే ఆర్డర్లు తీసుకుని వంటలను అందజేస్తున్నారు. హోం డెలివరీపై దూరాన్ని బట్టి రూ.80 నుంచి రూ.100 వరకు సర్వీసు ఛార్జీ వసూలు చేస్తున్నారు. పండగ సందర్భంగా పిండి వంటలు లేవనే చింతను ఇలా హోమ్ ఫుడ్స్, స్వీట్ స్టాల్స్ నిర్వాహకులు తీరుస్తున్నారు. రెడీమేడ్ వంటకాలు అందుబాటులో లేకుంటే కొన్ని పదార్థాలను పిల్లలకు పరిచయం చేసే పరిస్థితి ఉండేది కాదని పలువురు చెబుతున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న వంటకం

పందేలకు కోళ్లు రెడీ

రకాలను బట్టి ధరలు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

సంక్రాంతి పండగలో గ్రామీణ ప్రాంతాల్లో కోడి పందాలకు ప్రాధాన్యత ఇస్తారు. ప్రభుత్వం నిబంధనలు, కోర్టు ఆదేశాలతో కోడి పందాలకు అనుమతులు లేకపోయినా పందెం రాయుళ్లు మాత్రం ఏదో విధంగా మారుమూల ప్రాంతాల్లోనైనా కోడి పందాలు ఆడడం మామూలే. పండగ సందర్భంగా.. భోగి పండగ రోజు కొన్ని గ్రామాల్లో, సంక్రాంతి రోజున మరికొన్ని గ్రామాల్లో, కనుమ రోజున ఇంకొన్ని గ్రామాల్లో తీర్థాలు జరుగుతుంటాయి. ఆయాచోట్ల గతంలో అధిక సంఖ్యలో కోడి పందాలు జరుగుతుండేవి. ప్రస్తుతం కోడి పందాలపై నిషేధం ఉంది. అయినప్పటికీ పందాలకు కోళ్లను సిద్ధం చేయడం మండలంలో కనిపిస్తోంది. పందెం కోడి ఒక్కొక్కటీ ఒక్కో ధర పలుకుతోంది. గ్రామీణ ప్రాంతంలో నాలుగు వేల రూపాయల నుంచి పది వేల రూపాయలు వరకు ధర పలుకుతున్నాయి. వీటికి ప్రత్యేక ఆహారంగా బాదం పిస్తా, కోడిగుడ్లు, గంటి, చోడి తదితర కొవ్వు పట్టని ఆహారాన్ని అందిస్తూ ఉన్నారు. అలాగే ఉదయం, సాయంత్రం వేళల్లో ఆయాసం తట్టుకునే విధంగా నూతిలో ఈత కొట్టిస్తూ శిక్షణ ఇస్తున్నారు. కాకి, నెమలి, చేతువా, డేగ, నెమలి డేగ, తదితర రకాలు ఈ కోళ్లలో ఉన్నాయి. రకాల బట్టి ధరలు ఉంటాయని పందెం రాయుళ్లు అంటున్నారు.

కత్తి పందాలకే ప్రాధాన్యత



పందానికి సిద్ధంగా ఉన్న కోడి పుంజు

కోడి పందాల్లో ఎక్కువగా కత్తి పందాలకే ప్రాధాన్యత ఇస్తారు. ఐదు నుంచి పది నిమిషాల్లోనే పందెం పూర్తయిపోతుంది. గతంలో అయితే కోడి కాళ్లకు కత్తులు కట్టకుండా డింకీ పందాలు మాత్రమే ఆడుతూ ఉండేవారు. డింకీ పందాలు గంటల తరబడి సాగుతుండడంతో ఆ పందాలకు పందెం రాయుళ్లు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. కోడి కత్తి పందాలలో వేలాది రూపాయలు చేతులు మారుతూ ఉంటాయి.

పతంగుల పండగకు సర్వం సిద్ధం

- మార్కెట్లో బోలెడు రకాలు లభ్యం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

గాలిపటానికీ, కొత్త పండగ రోజులకూ గొప్ప అవినాభావ సంబంధం ఉంది. పతంగుల సరదా లేకుంటే నగరంలో సంక్రాంతి సంబరాల్లో ఏదో తెలీని వెలితి కనిపిస్తూ ఉంటుంది. అందుకే నగర వాసులు కొద్ది కాలంగా కైట్స్ ఫెస్టివల్స్ నిర్వహిస్తూ సందడిని షురూ చేస్తున్నారు. అందునా బీచ్ విస్తరించి ఉన్న మన సిటీలో పతంగుల సరదాలకు కొదువేమంటుంది చెప్పండి. ఒకప్పుడు ఓ కాగితం, రెండు కొబ్బరి పుల్లలతో ఎవరి గాలిపటాలు వాళ్లే తయారు చేసి ఎగురేసుకునేవాళ్లు. ఇప్పుడు మార్కెట్‌లో ఎవరెవరి కోరికకు తగినట్టుగానే వివిధ రకాల ఆకారాలలో తయారు చేసిన పతంగులు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే అమ్మకాలు ప్రారంభమయ్యాయి.

పతంగుల రెపరెపలతో బీచ్‌రోడ్డులో సంక్రాంతి సందడి నెలకొంది. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా చిన్నా, పెద్దా తేడా లేకుండా గాలిపటాలు ఎగురవేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. సంక్రాంతి పండగను మూడు రోజుల పాటు చేసుకోవడంలో ఎంతో ఆనందం దాగి ఉంటుంది. ఈ పండగలో సంప్రదాయమైన గాలిపటాలు ఎగుర వేయడం కూడా ఆనవాయితీగా వస్తోంది. అయితే గాలిపటాలను ఎగురవేయడానికి ఎక్కువ స్థలం, అనువైన ప్రదేశాలు ఉండటంతో గ్రామీణ ప్రాంతాల్లో పతంగులను ఎగురవేయడంలో పెద్దగా సమస్యలుండవు. కానీ కాంక్రీట్ కీకారణ్యంలా మారిన విశాఖ వంటి నగరాల్లో మాత్రం పతంగులను ఎగురవేసేందుకు సరైన స్థలం లేకపోవడంతో ఎత్తైన భవనాలపైన, గోడలపైన నిల్చుని మరీ గాలిపటాలను ఎగురవేసే దృశ్యాలు మనకు కనిపిస్తుంటాయి. ఇది అత్యంత ప్రమాదంతో కూడుకున్న వినోదమనే చెప్పాలి.

ఆకట్టుకునే డిజైన్లు

గాలిపటాల డిజైన్లలోనూ ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఒకప్పుడు సాదాగా ఉండే గాలిపటాలు తర్వాత పక్షులుగా, విమానాలుగా, కొన్నిరకాల జంతువులుగా మార్పు చెందాయి. కానీ తాజాగా ఓడల రూపంలోనూ, పాములుగానూ, చివరకు పిల్లలను అత్యంత ఆకట్టుకునే డోరోమెన్, ఛోటా భీమ్, స్పైడర్‌మెన్, యాంగ్రీబర్డ్‌తోపాటు ప్రధాని మోడీ, అమితాబ్ వంటి బొమ్మలతో కూడా పతంగులు తయారవుతుండటం విశేషం. గ్రద్ధ, తూనిగ, గుడ్ల గూబ, గబ్బిలం, డేగ, బటర్ ఫ్లై వంటి బొమ్మలతో కూడా పతంగులు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

అన్నీ దిగుమతి చేసుకున్నవే..

గతంలో ఇళ్లలోనే కాగితాలతో గాలి పటాలను తయారు చేసుకునేవారు. వీటిని సరైన ఆకృతిలో తయారు చేస్తేనే గాలిలో ఎగురగలవు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. రంగు రంగుల్లో విభిన్న డిజైన్లలో, ఆకృతుల్లో ఉన్న ఆకర్షణీయమైన గాలిపటాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

దీంతో కొల్‌కతా, ఖరగ్‌పూర్ వంటి ప్రాంతాల నుంచి కంటైనర్ ద్వారా విభిన్న రూపాలలో తయారైన గాలిపటాలను కూడా ఈ సారి అధికంగా విక్రయిస్తున్నారు. దళసరి ప్లాస్టిక్ కాగితంతో తయారు చేసిన గాలిపటాలకు ప్రస్తుతం డిమాండ్ ఉంది. ఈ సారి క్లాత్‌తో తయారు చేసిన గాలిపటాలు సైతం అందుబాటులో ఉన్నాయి. వీటి ధరలు రూ.10 నుంచి రూ.1000 వరకు ఉన్నాయి.

వైసిపి రాక్షస పాలన
మరో మూడు నెలల్లో అంతం


సమావేశంలో మాట్లాడుతున్న బి వి రామ్

ప్రజాశక్తి -భీమునిపట్నం : మరో మూడు నెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో ఐదేళ్ల వైసిపి రాక్షస పాలనకు స్వస్తి పలికి, టిడిపి, జనసేన కూటమిల ప్రభుత్వం ఏర్పాటుతో స్వర్ణయుగం రానుందని తెలుగు శక్తి అధ్యక్షులు బివి రామ్ అన్నారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజుతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ, వైసిపి పాలనలో అన్ని తరగతుల ప్రజలు అష్టకష్టాలను ఎదుర్కొన్నారని, రాష్ట్రంలో అన్ని రంగాల్లోనూ అభివృద్ధి కుంటుపడి అథోగతి పాలైందన్నారు. వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఇప్పటి వరకూ తెలుగుశక్తి 7 ఆడియో సిడిలను విడుదల చేసిందన్నారు. ఈనెల 18న ఎన్‌టిఆర్ వర్ధంతి రోజున 'ఎదురు లేని మనిషి' ఆడియో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అంగన్వాడీల పోరాటానికి తెలుగు శక్తి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో పార్టీ నాయకులు ఆర్ వెంకటరావు, ఎం రాజేంద్రప్రసాద్, జెపి రాజు, కె కిషోర్ పాల్గొన్నారు

వైభవంగా గోదాదేవి కల్యాణం

ప్రజాశక్తి- పెందుర్తి : 94వ వార్డు పరిధి రవినగర్ శేషాద్రి కొండపై కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల ముగింపును పురస్కరించుకొని ఆదివారం గోదాదేవి కల్యాణం నిర్వహించారు. భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి కల్యాణంలో పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా గోదాదేవి కల్యాణం నిర్వహించిన అర్చకులు, అనంతరం భక్తులకు తలంబ్రాలు, ప్రసాదం వితరణ చేపట్టారు. భక్తుల కోసం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

సింహాచలం: ధనుర్మాసోత్సవాల ముగింపు సందర్భంగా వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం గోదారంగనాధుని కల్యాణోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. వంద జంటలు పాల్గొన్నాయి. సింహగిరిపై గోద రంగనాధుల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు కల్యాణ అక్షింతలతో పాటు కండువా జాకెట్, స్వామి ప్రసాదాన్ని అందజేశారు.

ప్లాస్టిక్ వాడకంతో కేన్సర్ ముప్పు


గోనె సంచులను అందజేస్తున్న సర్పంచ్ చెన్నారావు

ప్రజాశక్తి -పద్మనాభం: ప్లాస్టిక్ వాడకం వల్ల కేన్సర్ ముప్పు పొంచి ఉందని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు అన్నారు. ఆదివారం మండలంలోని శేరీఖండం గ్రామపంచాయతీలో సర్పంచ్ పల్లంటి చెన్నారావు ఆధ్వర్యంలో గోనెసంచులు పంపిణీ చేశారు. తన సోదరుడు పి పద్మనాభం జ్ఞాపకార్థం తరుణ్ రూ.లక్ష వెచ్చించి సమకూర్చిన గోనెసంచులను గ్రామంలో ప్రతిఇంటికీ మూడు విభిన్న సైజుల్లోని పంపిణీ చేశారు. గ్రామంలో ఇప్పటివరకు ప్లాస్టిక్ సంచులు వాడుతున్న వారంతా ఇకనైనా ప్లాస్టిక్‌ను వీడి, గోనెసంచులను వాడాలన్న సదుద్దేశ్యంతో వీటిని పంపిణీ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తులసి, పెద్దయ్య, ఆదిబాబు పాల్గొన్నారు,

జిఒ1062 రద్దు చేయకుంటే
17 నుంచి జాతీయ రహదారి దిగ్బంధనం
లారీ డ్రైవర్లు, క్లీనర్ల అసోసియేషన్


మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసు

ప్రజాశక్తి-ఆనందపురం : లారీ డ్రైవర్లకు ఆశనిపాతంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 1062 జిఒను తక్షణం రద్దు చేయకుంటే ఈ నెల 17న దేశవ్యాప్తంగా జాతీయరహదారులను దిగ్బంధనం చేస్తామని జయహో రథసారధి లారీ డ్రైవర్లు, క్లీనర్ల అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఓలేటి వాసు అన్నారు. ఆదివారం బిపి.కల్లాలులో శుభశ్రీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతూ, అవాంచితంగానైనా జరిగే రోడ్డు ప్రమాదాలకు లారీ డ్రైవర్లను బాధ్యులను చేస్తూ, దానికింద పదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.ఏడు లక్షల వరకు జరిమానా వేసేలా జిఒ 1062ను ఇటీవల పార్లమెంట్‌లో కేంద్రప్రభుత్వం ఆమోదించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అనుకోని ప్రమాదాలకు లారీ డ్రైవర్లను బాధ్యులు చేయడం సరికాదన్నారు. బతుకు తెరువులేక డ్రైవర్ వృత్తిని ఎంచుకున్న వారికి ఇది నిజంగా శరాఘాతమని, తక్షణమే ఉపసంహరించు కోవాలన్నారు. కార్యక్రమంలో జయహో రథసారథి డ్రైవర్ క్లీనర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఓలేటి వాసు , సెక్రటరీ భూపతి రాజు, ట్రెజరర్ కేసరి కుమార్, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జిలు రామకృష్ణ, మాణిక్యం, దుర్గారావు, ఆనందపురం లారీ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షులు గండ్రెడ్డి సూర్యనారాయణ, కార్యదర్శి పూడి అప్పారావు, ట్రెజరర్ బంటుభిల్లి పైడినాయుడు, కిలాని శ్రీను, బూర్లె అప్పలనారాయణ, ఎడ్ల రమణ, తోమురోతు అప్పలనారాయణ, పాల్గొన్నారు.

యువకుల సేవాభావం
రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లకు జీబ్రా రంగులు


స్పీడ్ బ్రేకర్లకు తెల్లని రంగు వేస్తున్న యువకులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : వేగనియంత్రణ ద్వారా ప్రమాదాలను నివారించాలన్న ఉద్దేశ్యంతో ఏర్పాటుచేసిన స్పీడ్ బ్రేకర్లను సకాలంలో గుర్తించలేక వాహన ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో స్థానిక యువకులు ముందుకు వచ్చి వాటికి జీబ్రారంగులు వేశారు. ఆదివారం స్థానిక మెయిన్ రోడ్డు శివాలయం వద్ద, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద సంబంధిత అధికారులు ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లకు తెల్లని రంగులు దిద్దడం ద్వారా ఎంత వేగంగా వచ్చినా గుర్తించే విధంగా చర్యలు చేపట్టారు.

వాహనాలపై ప్రయాణిస్తున్నప్పుడు ముఖ్యంగా రాత్రి సమయంలో స్పీడ్ బ్రేకర్లు గుర్తించలేని పరిస్థితి ఉందని గుర్తించి యువకులు ఇలా ముందుకు వచ్చి ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లకు తెల్లని రంగులు వేయడం ప్రశంసనీయమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు తెలిపారు. యువకుల సేవాభావం, చొరవను నూకరాజుతో పాటు ఉపాధ్యాయులు పైడి రాజు, శ్రీను, స్థానికులు రాజు, వంశీ అభినందించారు

అప్పన్నను దర్శించిన హైకోర్టు చీఫ్ జస్టిస్

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను ఆదివారం భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని హైకోర్టు జస్టిస్ ధనుంజయ్‌సింగ్ టక్కూర్ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఇఒ సింగాల శ్రీనివాసమూర్తి ఆలయ సాంప్రదాయ ప్రకారం సాదరంగా స్వాగతం పలికారు. కప్ప స్తంభం ఆలింగనం, బేడా మండపం ప్రదక్షిణ, స్వామి అంతరాలయంలోనూ గోదాదేవి సన్నిధిలో గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, ఇఒ దుశ్శాలువాతో సత్కరించి స్వామి ప్రసాదాన్ని చిత్రపటాన్ని అందజేశారు.

18న సినీ దర్శకుడు గోపాలకృష్ణకు సత్కారం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రముఖ సినీ దర్శకులు ఎస్ గోపాలకృష్ణను ఈ నెల 18న సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక చిన్న బజారులోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో కళాసాహితీ సంస్థ ఆధ్వర్యాన సన్మానం చేయనున్నట్లు సంస్థ అధ్యక్షులు పి రాజేంద్రప్రసాద్ వర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా జెడ్‌పి బొడ్డేపల్లి రాము, సిఐ డి రమేష్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. అనంతరం బాలలచే సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు.

రాష్ట్ర ప్రభుత్వానికి రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం
యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-రంపచోడవరం : ఉద్యోగుల సమస్యలు పరిష్కరించుకుంటే జగన్ ప్రభుత్వానికి రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం రంపచోడవరంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్వాడీల దీక్ష శిబిరాన్ని సందర్శించి, యుటిఎఫ్ తరపున మద్దతు తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా జారీ చేసిన జిఒలను భోగిమంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, సిపిఎస్ రద్దుచేసి పాత పింఛను పునరుద్ధరిస్తామని హామీఇచ్చిన సిఎం జగన్ దాన్ని అమలు చేయకపోగా, గుదిబండ లాంటి జిపిఎస్‌ను రుద్దారన్నారు.ఒపిఎస్ పునరుద్ధరణ కోరుతూ ఈనెల 24న మండల, జిల్లా కేంద్రాల్లో నిరసన, 31నుంచి వచ్చేనెల 4వరకు నిరాహారదీక్షలు చేస్తామని, అప్పటికీ దిగిరాకుంటే చలో విజయవాడ ఆందోళన చేపడతామన్నారు.

అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా కోటి సంతకాల సేకరణలో భాగంగా యుటిఎఫ్, సిఐటియు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సంతకాలను చేసి సంఘీభావం ప్రకటించారు

పలుచోట్ల ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సిఐటియు, ఐద్వా ఆధ్వర్యాన రామనగర్ బజార్‌లో కె.నర్సింగరావు అధ్యక్షతన సంక్రాంతి సందర్భంగా ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళా సంఘం నాయకులు కె.మణి, బి.సత్యవతి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం విజేతలకు రామ్‌నగర్ పెద్దలు సోములు ద్వారా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.రామారావు, సిఐటియు జగదాంబ జోన్ నాయకులు కెవిపి చంద్రమౌళి, డివైఎఫ్ఐ నాయకులు కె.గణేష్, సీనియర్ నాయకులు ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందిస్తున్న సిఐటియు, ఐద్వా నేతలు

పెందుర్తి : 95వ వార్డు పురుషోత్తపురం దరి హౌసింగ్ బోర్డ్ కాలనీలో రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు చందు యాదవ్,అసోసియేషన్ అధ్యక్షురాలు గున్నాదేవి, కార్యదర్శి సూర్య ప్రకాష్, జాయింట్ సెక్రటరీ పద్మ, కాలనీ మహిళలు పెద్దలు పాల్గొన్నారు

పెందుర్తి :97వ వార్డు పులగాలిపాలెంలో జనసేన ఆధ్వర్యంలో మన ఊరు మన ఆట కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ వార్డు అధ్యక్షులు సేనాపతి సోమశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో భోగి, సంక్రాంతి పండుగలను పురస్కరించుకొని ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వార్డు ఉపాధ్యక్షులు మేడిశెట్టి అప్పారావు , సరిపల్లి గ్రామం జనసేన నాయకులు రమేష్, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.


పెందుర్తిలో ముగ్గులు వేస్తున్న మహిళలు

సబ్బవరం:మండలంలోని అసకపల్లి పంచాయతీలో భోగి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలను పిఎసిఎస్ చైర్మన్ కాపుశెట్టి శేషుబాబు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలను స్థానిక సిఐ పిన్నింటి రమణ ప్రారంభించారు. అనంతరం విజేతలను బహుమతులను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కుర్చీలను పిఎసిఎస్ చైర్మన్ శేషుబాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాపుశెట్టి నీలమణి, ఉప సర్పంచ్ కరణం సురేష్ బాబు, కరణం రమణ, కర్రి నాయుడు, ఎస్. కన్నయ్య ,కర్రి అప్పారావు ,గొర్లి పరదేశి పాల్గొన్నారు.

నక్కపల్లి:నక్కపల్లిలో మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత తన నివాసం వద్ద ఆదివారం సంక్రాంతి పురస్కరించుకుని ముగ్గులు పోటీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు. సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది.


ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనిత

ప్రాజెక్టుల నిర్మాణం ఏదీ?

-మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి - కశింకోట : సుజల స్రవంతిని తుంగలో తొక్కిన ముఖ్యమంత్రి జగన్ అని టిడిపి మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు విమర్శించారు. మండలంలో తీడ గ్రామంలో భోగి రోజు మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు శీర్ష మోత్సవానికి రాష్ట్ర మాజీ చింతకాయల అయ్యన్నపాత్రుడు ముఖ్యఅతిథిగా పాల్గొని ఎన్టీఆర్ విగ్రహాన్ని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, రాష్ట్రంలో సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తయితే ఉత్తరాంధ్ర ప్రాంతమంతా సంవత్సరానికి రెండు పంటలు పండే విధంగా ఉండేదన్నారు. పోలవరం ప్రాజెక్టు కూడా కమీషన్ కోసం చేపట్టలేదన్నారు. ముఖ్యమంత్రిని త్వరలో ఇంటికి పంపించాలన్నారు మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ, దొంగ ఓట్లను సృష్టించి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని జగన్ చూస్తున్నారని విమర్శించారు. గుడివాడ అమర్నాథ్‌కు టికెట్ ఇవ్వలేదంటే జిల్లాలో దోచుకున్న విషయం ముఖ్యమంత్రి దృష్టిలో ఉందని తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధిని మరచి ఆయన అభివృద్ధికి దోచుకున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ, ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించి తెలుగు ప్రజలలో మంచి గుర్తింపు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కోట్ని బాలాజీ, కాయలు మురళీధర్, ఉగ్గిన రమణమూర్తి, వేగి గోపికృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, పెంటకోట రాము పాల్గొన్నారు.



ఎన్టిఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న అయ్యన్న



కలుసుకున్న పూర్వ క్రీడాకారులు

పూర్వ క్రీడాకారుల కలయిక

ప్రజాశక్తి- చోడవరం: భోగి పండుగను పురస్కరించుకుని 1995-2005 మధ్యకాలంలో చోడవరం నుంచి క్రికెట్ టీములకు ప్రాతినిధ్యం వహించిన పూర్వ క్రీడాకారులందరూ ఆదివారం స్థానిక హైస్కూల్ గ్రౌండ్ లో కలుసుకున్నారు. ఉదయం నుంచి ఉత్సాహంగా క్రికెట్ ఆడారు. ఒకరి కొకరు యోగా క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎ.రవి ప్రతాప్, డివిఎస్.గణేష్, జె.శంకర్, కె.రఘు, నగేష్, గణేష్, వెంకటరావు, మహేష్, శివ, మూలినాయుడు, అంబి, కార్తీక్, శ్రీకాంత్, శ్రీను తదితర క్రీడాకారులు పాల్గొన్నారు.



చెక్కును ఇస్తున్న బూడి

బాధితులకు రూ .15 లక్షల పరిహారం అందజేత

ప్రజాశక్తి-మాడుగుల: ప్రమాద బాధిత గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం నుండి రూ.15 లక్షల పరిహారాన్ని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అందించారు. నవంబర్ 2న మండలంలోని ఘాట్ రోడ్ జంక్షన్‌లో జరిగిన సామాజిక సాధికార బస్సుయాత్ర సభకు వచ్చి తిరుగు ప్రయాణంలో జరిగిన వాహన ప్రమాదంలో అవురువాడ పంచాయతీ పెద్ద గొరిగడ్డ గ్రామానికి చెందిన గిరి మహిళలు గాయపడ్డారు. ఈ మేరకు రూ.5 లక్షల చొప్పున ముగ్గురికి రూ.15 లక్షల ప్రమాద పరిహారం మంజూరు అయ్యాయి. ఈ నగదును డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు బాధితులకు అందజేశారు.

వెంకన్న ఆలయాల్లో గోదాదేవి కల్యాణం

ప్రజాశక్తి -వడ్డాది: వడ్డాది గిరిజాంబ గిరిపై కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గత నెల 16 నుండి ప్రతిరోజు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆదివారం భోగి పండుగ సందర్భంగా గోదాదేవి రంగనాథ స్వామి కళ్యాణ వేడుక కనులు పండగగా నిర్వహించారు. అర్చకులు అంగర శ్రీకాంతాచార్యులు, ఈఓ. శర్మ ఆధ్వర్యంలో కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.

నక్కపల్లి: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మధ్యాహ్నం గోదా రంగనాధుల కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్వామివారి పుష్ప తోటలో గోదా రంగనాథుల కళ్యాణాన్ని అర్చక బృందం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తుల తరలివచ్చి కళ్యాణాన్ని తిలకించారు. ఉత్సవ మూర్తులతో తిరు వీధి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు తదితరులు పాల్గొన్నారు .



నక్కపల్లిలో పూజలు చేస్తున్న అర్చకులు



ప్రతిభ చాటిన విద్యార్థులు

వ్యవసాయ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- సబ్బవరం: మండలంలోని మొగలిపురం గ్రామంలో శ్రీకాకుళం జిల్లా కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలకు చెందిన వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గత నెల రోజులుగా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల చోడవరం మండలం చీడికాడ మండలంలో కృషి విజ్ఞానకేంద్రం (కొండెంపూడి) ఆధ్వర్యంలో జరిగిన రైతు సదస్సులో పాల్గొని వ్యవసాయ నమూనాలను ప్రదర్శించి తమ ప్రతిభను కనబరిచి మన్ననలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఖండివారం సర్పంచ్ సీరంరెడ్డి లక్ష్మీ, అప్పలరాజు పురం ఎమ్ పి టి సి జయమ్మ, కొండెం పూడి కెవికె ..పిఎస్ఎన్ రాజ్ కుమారి, డాక్టర్ ఎన్ కిషోర్ కుమార్, డాక్టర్ సత్తి బాబు, డాక్టర్ సౌజన్య పాల్గొన్నారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-రోలుగుంట: దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రోలుగుంట పోలీసులు మైక్ ద్వారా ప్రచారం నిర్వహించారు. ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది గ్రామాల్లో పర్యటించారు. పండక్కి సొంత గ్రామాలకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామాల్లో కోడిపందాలు, గుల్లాటలు, పేకాట వంటి జూదం నిర్వహించరాదన్నారు.



ప్రచారం చేస్తున్న ఎస్ఐ సురేష్

పలు చోట్ల దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-మునగపాక: మండలంలో మూలపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ బీశెట్టి గంగ అప్పల నాయుడు తన సొంత నిధులతో నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు కాండ్రేగుల నాని, ఎల్లపు నాయుడు, కాండ్రేగుల శ్రీనివాసరావు, బొడ్డేడ రవికుమార్, కాండ్రేగుల నాగేశ్వరరావు, బొడ్డేడ ఆది కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బుచ్చయ్యపేట మండలంలో దుస్తులు ఇస్తున్న సర్పంచ్

బుచ్చియపేట : మండలంలోని ఆర్ భీమవరం గ్రామం లో గ్రామ సర్పంచ్ బల్లిన అమ్మునాయుడు పంచాయితీ పారిశుధ్య కార్మికులకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ బల్లిన నాయుడు, చిన్నోడు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లి: కీర్తిశేషులు బుద్ద చిన్న సూర్యనారాయణ (మ్యాంగో ఎగుమతుల వ్యాపారి) జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు బుద్ద రాజేష్, బుద్ద సూర్యప్రకాష్‌లు పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్క్ ఇంజనీరింగ్ కాలేజ్ అధ్యక్షులు కొణతాల బాలసుబ్రమణ్యం, బుద్ద మోహన్, బుద్ద సంతోష్, కొంతాల మాధవ, బుద్ద జగదీష్ పాల్గొన్నారు.

అనకాపల్లి: స్థానిక సిద్ధార్థ సోషల్ సర్వీస్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో శోభన్ బాబు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శోభన్ బాబు చిత్రపటానికి సంస్థ అధ్యక్షులు బల్లా నాగభూషణం పూల మాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరము నిరుపేదలైన మహిళలు, వృద్ధులకు దుస్తులు, అందజేసారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పట్నాల కృష్ణమోహన్, కొత్తూర్తి రామారావు, రొబ్బి మల్లేశ్వర రావు,రొబ్బి చంద్ర రావు పాల్గొన్నారు.

మునగపాక: అప్పలనాయుడు చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని అనకాపల్లి జిల్లా వైకాపా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ కొనియాడారు. స్థానిక శ్రీ చక్ర జియోషిత పాలజీ బ్రిక్స్ అధినేత ఆడారి అప్పలనాయుడు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆదివారం 300 మంది నిరుపేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అప్పలనాయుడు గతంలో అతని తండ్రి జ్ఞాపకార్థం తన సొంత నిధులతో రచ్చబండ ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొడ్డేడ అప్పలనాయుడు, ఎంపీటీసీ సూరిశెట్టి రాముపాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని అచ్చెర్ల గ్రామంలో సంక్రాంతి సందర్భంగా తిరుమల డైరీ మేనేజరు యన్ రమణారావు, సెక్రటరీ యన్ భూషణం ఆధ్వర్యంలో పాడి రైతులకు దుప్పట్లు, పది రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిమ్మదల సన్యాసినాయుడు, రామారావు, నాగేశ్వరరావు, నిమ్మదల సూరి అప్పలరాజు, మాజీ సర్పంచ్ పొన్నాడ రాజు, వార్డ్ నెంబరు నిమ్మదల గంగా మహాలక్ష్మి నాయుడు పాల్గొన్నారు.

గొలుగొండ: సంక్రాంతి పండుగ సందర్భంగా లెక్కల కుటుంబం, మాజీ సర్పంచ్ లెక్కల కాశీ రత్నం, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ ఆధ్వర్యంలో పాతమల్లంపేట పంచాయతీలోని 300 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సతీష్, బాలాజీ, విజయ్, అనిల్, శ్రీను, శరత్ నానాజీ, శాంతినీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గొలుగొండ: బిజెపి నాయకులు గాదె శ్రీనివాసరావు తన పుట్టిన రోజు సందర్భంగా కొత్తజోగంపేటలో వృద్ధులకు బట్టలు పంపిణీ చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాయపురెడ్డి శ్రీరామమూర్తి, బిజెపి నాయకులు బంగారు నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు గణేష్, పిఎ అడిగర్ల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆదివారం 200 మంది మహిళలకు దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తన కార్యాలయంలో చీరలు పంపిణీచేశారు. ముందుగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, వైవి.సుబ్బారెడ్డి చిత్రపటాలతో కూడిన నూతన సంవత్సర కేలండర్‌ను వైసిపి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు లేని ఆంధ్రప్రదేశ్‌గా చూడాలన్న జగనన్న సంకల్పానికి మనమందరమూ తోడు నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గం వార్డు అధ్యక్షులు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-కె.కోటపాడు: మండలంలోని గొట్లాం, సూది వలస గ్రామాల్లో ఆదివారం డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ముందుగా గొట్లాం గ్రామంలో 20 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సిసి రోడ్డు, కాలువలను ప్రారంభించారు. సూది వలస గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, ఇంటింటి కులాయిలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బూడి మాట్లాడుతూ, అభివృద్ధికి చిరునామాగా మాడుగుల నియోజకవర్గాన్ని తయారు చేశానన్నారు. ప్రతి మారుమూల గ్రామాలను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు.అనంతరం గ్రామంలో కిలపర్తి నాయుడు సమకూర్చిన చీరలను కోలాటం గ్రూపులకు మంత్రి ముత్యాల నాయుడు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి జగన్మోహన్, జడ్పిటిసి ఈర్లే అనురాధ, స్థానిక సర్పంచ్ ఆదిరెడ్డి సన్యాసినాయుడు, ఎంపిటిసి వర్రి రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -అనకాపల్లి: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పాత్రపల్లి.వీరు యాదవ్ ఆధ్వర్యంలో ఎస్.డి (గ్రూప్) అధినేత కాండ్రేగుల శ్రీ రామ్ నివాసం వద్ద శ్రీ రామ్ చేతుల మీదుగా సొసైటీ క్యాలెండర్ ఆదివారం ఆవిష్కరించడమైనది. ఈ సందర్భంగా కాండ్రేగుల శ్రీ రామ్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం తరపున దివ్యాంగులకు ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారని, చిన్న చిన్న సమస్యలకే సతమతమయ్యే సకలాంగులు, ఈ దివ్యాంగులలో ఉన్న ఆత్మస్థైర్యాన్ని చూసి, సమస్యలను ఎలా అధిగమించాలో నేర్చుకోవాలన్నారు.దివ్యాంగులకు సహకరించడం తనకు ఎంతో ఆనందాన్నిస్తుందన్నారు.

వైసిపి పాలనకు చరమగీతం పాడాలి

ప్రజాశక్తి- దేవరాపల్లి:రాష్ట్రంలో బీసీలకు అన్యాయం చేసిన సైకో పాలనకు చరమగీతం పాడాలని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు పిలుపునిచ్చారు. దేవరాపల్లిలో మాడుగుల నియోజకవర్గం ఇంచార్జ్ పివిజి కుమార్ అధ్యక్షతన జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బిసి చట్టంపై అవగాహన కల్పిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలి వద్ద, ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆయన మాట్లాడారు. బీసీలంతా ఏకమై రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి బీసీ సోదరులకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాంగుల సంఘం కన్వీనర్ బత్తుల లక్ష్మి, పోతల పాత్రు నాయుడు, నానాజీ, నాయుడు పాల్గొన్నారు.

నాటు కోళ్లకు గిరాకీ

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట: సంక్రాంతి సందర్భంగా మండలంలోని వడ్డాది సంతలో ఆదివారం నాటు కోళ్లకు గిరాకీ ఏర్పడింది. సంక్రాంతి పండుగ సందర్భంగా ఉదయం 6 గంటల నుండి సంతకు నాటు కోళ్ళు అధికంగా వచ్చాయి. దూర ప్రాంతాల నుండి ప్రత్యేకంగా కోళ్ల కొనుగోలు కోసం పెద్ద సంఖ్యలో విచ్చేయడంతో సంత కళకళలాడింది. ఒక్కో కోడి రూ.వెయ్యి నుండి 5 వేల వరకు ధర పలికింది. పందెం పుంజులు సైతం అమ్మకానికి వచ్చాయి. గత ఏడాదితో పోలిస్తే ధరలు అధికంగా ఉన్నప్పటికీ కొనుగోలుకు వెనుకాడ లేదు. మధ్యాహ్నం వరకు నాటు కోళ్ల సంత సాగింది.

ఘనంగా శోభన్‌బాబు జయంతి

ప్రజాశక్తి-అనకాపల్లి:ఆంధ్రుల అందాల నటుడు శోభన్ బాబు జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని విజయరామరాజు పేటలో ఆల్ ఇండియా శోభన్ బాబు ఫ్యాన్స్ అధ్యక్షులు ముగడ అప్పారావు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శోభన్ బాబు చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల శివరామ సత్యనారాయణ, పలకా రాము, పోలారపు త్రినాధ్, అప్పికొండ వెంకట్రావు, పలకా సత్యనారాయణ, ఆళ్ల రామకష్ణ, పూడి త్రినాథ్, ఇల్లపు రెడ్డి , సారిపిల్లి శ్రీను, బొబ్బిలి అప్పలరాజు, అపికొండ మహేష్, విజయ రామరాజుపేట గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

27న గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

ప్రజాశక్తి- అనకాపల్లి: అనకాపల్లిలో గవరపాలెం గౌరీ పరమేశ్వరుల మహెూత్సవం ఈనెల 27న ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు, ఉత్సవ పర్యవేక్షకులు కొణతాల మురళీకష్ణ తెలిపారు. గౌరపాలెం శ్రీ గౌరీ పరమేశ్వరుల కళ్యాణ్ మండపంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ప్రస్తుతం ఈ ఉత్సవాన్ని 52 స్టేజి ప్రోగ్రాములు, కలకత్తా లైటింగ్, భారీ మందు గుండు, ఐదు స్టేజీల డాన్స్ ప్రోగ్రాం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా విరాళ దాతల క్యాలెండర్, స్టిక్కర్ ఆవిష్కరణ చేశారు.ఉత్సవ సమయాన్ని రాత్రి 11:30 తోనే ముగించమని పోలీసులు ఆంక్షలు విధించడం సరికాదన్నారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల మహాలక్ష్మి నాయుడు, ఉపాధ్యక్షులు వనతాల వెంకట వరప్రసాద్, కొణతాల సత్యనారాయణ, కొణతాల జగ్గారావు, కొణతాల చంద్రశేఖర్, పివి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో సమస్యలపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో వైద్యం అందని ద్రాక్షలా మారిందని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర ఆరోపించారు. ఆదివారం జనసేన నాయకులతో కలిసి ఆసుపత్రిని సందర్శించారు. అనంతరం రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన ఈ నాలుగున్నరేళ్ల కాలంలో ఆసుపత్రి మరింత దిగజారిపోయిందన్నారు.ఇక్కడి కొంత మంది వైద్యులు బయట ప్రైవేటు ప్రాక్టీస్ చేయడంతో వారి ఆసుపత్రులకు రోగులను రిఫర్ చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆసుపత్రిలో మందుల కొరత ఉందన్నారు. ప్రైవేటు ల్యాబ్‌లకు చెందిన వ్యక్తులు ఆసుపత్రిలోనే తిష్ట వేశారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ నాయకులు కొత్తకోట రామశేఖర్, పెనుపోతల నాగు, నర్సీపట్నం యూత్ ప్రెసిడెంట్ అల్లు నరేష్ పాల్గొన్నారు.

పండుగ వేళ..నిరసనల జ్వాలలు

-భోగి మంటల్లో జిఒ ప్రతులు దగ్ధం -కొనసాగిన అంగన్వాడీల ఆందోళనలు



సబ్బవరంలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - విలేకర్ల బృందం

సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీల ఆందోళనలు ఆదివారం 34వ రోజుకు చేరింది. భోగి మంటల్లో జిఒ 2 ప్రతులు దగ్ధం చేశారు.

ప్రజాశక్తి- మునగపాక:సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీలు చేపట్టిన ఆందోళన ఆదివారం నాటికి 34వ రోజుకు చేరుకుంది. శిబిరం వద్ద భోగి మంటలు వేసి ఎస్మా, జీవో 2 ప్రతులు, షోకాజ్ నోటీసులను మంటల్లో వేసి దగ్ధ చేశారు. ప్రభుత్వ మొండి వైఖరి విడనాడాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అంగన్వాడీల నిరసన శిబిరాన్ని సిఐటియు జిల్లా నాయకులు రొంగలి రాము సందర్శించి సంఘీభావాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ తో కుటుంబ సభ్యులతో సంతోషంగా ఇళ్లల్లో ఉండాల్సిన అంగన్‌వాడీలు ప్రభుత్వం మొండి వైఖరితో రోడ్డెక్కి నిరసన తెలియజేసే పరిస్థితి దాపురించిందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎస్.బ్రహ్మాజీ, అంగన్వాడీలు లక్ష్మి, రామలక్ష్మి, హేమలత, అంజలి, ఉమాదేవి, రాణి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: మండల కేంద్రంలో అంగన్వాడీలు సంక్రాంతి ముగ్గులు వేసి నిరసన చేపట్టారు. ప్రాజెక్టు కార్యదర్శి జి.వరలక్ష్మి, పద్మ, సన్యాసమ్మ, గౌరి, అమ్మాజి, గాయిత్రి తదితరులు మాట్లాడారు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, బిటి దొర మద్దతు ఇచ్చారు.

చీడికాడ:అంగన్వాడీల సమ్మె 33వ రోజు కొనసాగింది. చీడికాడ ఆటో స్టాండ్ వద్ద అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు భోగి మంటల్లో నోటీసులు వేసి దగ్ధం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కారం చేయకపోతే సీఎం క్యాంప్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. తమకు వేతనాలు పెంచి గ్రాడ్యుయేట్ అమలు చేసి మిగతా సమస్యలను పరిష్కారం చేయాలి అని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఆర్ దేముడు నాయుడు అంగన్వాడి ప్రాజెక్టు లీడర్ ఎం జానకి ఉమ దేవి రామలక్ష్మి లక్ష్మి నిర్మల పెద్ద ఎత్తున అంగన్వాడి కార్మికులు పాల్గొన్నారు

పరవాడ: స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట భోగి మంటల్లో షోకాజ్ నోటీసులు, జీవో 2 ప్రతులను వేసి దగ్ధం చేశారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కారం చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, అంగన్వాడి ప్రాజెక్టు నాయకులు సిహెచ్ దేవి, ఎం.రమణి, ఎస్ పార్వతి, రామలక్ష్మి, అరుణ, శ్రీదేవి పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట:మండలంలోని పలు గ్రామల్లో అంగన్వాడి కార్యకర్తలు బోగి మంటల్లో జీవో కాపీలను భోగి మంటల్లో వేసి దగ్ధం చేశారు. సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఏలిసెట్టి అమ్మాజి, తదితరులు పాల్గొన్నారు.

రావికమతం: మండలంలో అంగన్వాడీలు కోటి సంతకాల సేకరణ చేపడుతున్నట్లు ప్రాజెక్టు కార్యదర్శి సత్యవేణి తెలిపారు. ప్రభుత్వం చర్చల పేరుతో తమను రమ్మని కాలయాపన చేస్తుందని, తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకు తాము సమ్మెను విరమించేది లేదని ఆమె హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం సావధానంగా ఆలోచించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆమె కోరారు.

సబ్బవరం:మండలంలోని అంగన్వాడీల రిలే దీక్షలు 33 వ రోజు కొనసాగాయి.ఈ సందర్భంగాఅంగన్వాడీ లకు ప్రభుత్వం ఇచ్చిన నోటీసులను భోగి మంటల్లో వేసి తగుల బెట్టారు. తాము గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా అంగన్వాడీల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. .ప్రభుత్వం ఎస్మా యాక్టు విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు వి.వి.రమణమ్మ, ఎం.వరలక్ష్మి, డి.పుష్ప, ఎస్ .జగదీశ్వరి, ఆర్. శివరామ లక్ష్మీ, వి.సుభాషిణి, ఎం.కనకమ్మ, జి. అరుణ కుమారి, ఎస్.రమణమ్మ, డి.భారతి, ఎ. రమణమ్మ, పి.సూరమ్మ, ఎన్.సత్యవేణి పాల్గొన్నారు.

మోకాళ్ళపై నిలబడి నిరసన

నక్కపల్లి:సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ మండల పరిషత్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్ష శిబిరం వద్ద మోకాళ్ళపై నిలబడి వినూత్న నిరసన తెలిపారు. పస్తులతో పండగ పూట కూడా న్యాయమైన సమస్యల కోసం పోరాడవలసిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి, ప్రాజెక్టు అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, యూనియన్ నాయకులు కవిత, లక్ష్మీ రాజ్యం, మంగ లక్ష్మీ, రమణమ్మ, జయ, ఆర్‌వికె లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అంగన్వాడీల నిరవధిక సమ్మె శిబిరం ఆదివారం 34వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద భోగిమంట వేసి, అందులో ఎస్మాచట్టం, జిఒ2 ప్రతులను మంటలో దగ్ధం చేసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీఈ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి దేవి మాట్లాడుతూ, ఇచ్చిన హామీని అమలు చేయకుండా తమను మోసగించడమే కాకుండా, మహిళలమని కూడా చూడకుండా 34రోజులుగా దీక్ష చేస్తుంటే చర్చలకు పిలుస్తూ అవమాన పరుస్తున్నారన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి, చీకటి పోయి వెలుగుకాంతులు ప్రసరించడానికి ప్రతీకగా నిలిచిన భోగిమంటలతోనైనా సిఎం జగన్ అజ్ఞానాన్ని వీడి, ఇచ్చిన హామీని నెరవేరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పండుగలను సమ్మె శిబిరంలోనే జరుపుకోవాల్సిన దుస్థితి కల్పించిన సిఎం జగన్, వైసిపి ప్రభుత్వపెద్దలు ఇప్పటికైనా కళ్లు తెరవాలన్నారు. కోటి సంతకాల ప్రక్రియను పూర్తిచేసి, పండుగ తర్వాత తాడేపల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారుకార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బృందావతి, భవానీ, సిఐటియు జిల్లా కార్యదర్శి జగన్ పాల్గొన్నారు

పండగ మీకు, పస్తులు మాకా

విశాఖ కలెక్టరేట్ : సమ్మెలో భాగంగా ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఖాళీ గిన్నెలు, కంచాలతో మోత మోగిస్తూ పండగపూట "పస్తులు మాకు - పండగ మీకు"అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వీరికి సంఘీభావంగా సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, సిఐటియు జిల్లా నాయకులు పి.వెంకటరెడ్డి, వి.కృష్ణారావు, ఎఐటియుసి నాయకులు పడాల రమణ తదితరులు మాట్లాడారు. అంగన్‌వాడీలను విధుల నుండి తొలగిస్తామని బెదిరించడం, ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం వంటి చర్యలకు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాల్పడడం దారుణమన్నారు. అంగన్‌వాడీలను బెదిరించి, భయపెట్టి ఉద్యమాన్ని అణిచివేయాలంటే సహించేది లేదన్నారు. తక్షణమే జీతాలు పెంచాలని, లేకుంటే అఖిల పక్ష రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల మద్దతుతో రాష్ట్ర బంద్ చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వై.తులసి, వెంకటలక్ష్మి, నాగేశ్వరి, శోభ, కృప, శాంతి, సుజాత, పూజిత, దేవి, విజయ, రామలక్ష్మి, శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.వీరి పోరాటానికి న్యాయ వాదులు మద్దతు తెలిపారు. రూ.5 వేలు పోరాట నిధి అందజేశారు.



నక్కపల్లిలో మోకాళ్లపై నిరసన

భోగి మంటల్లో జిపిఎస్ ప్రతులు



భోగి మంటల వద్ద నిరసన చేపడుతున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం డివిజన్ యుటిఎఫ్ నాయకుల ఆదివారం పట్టణంలో ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా భోగి మంటల్లో జిఒ ప్రతులను దగ్ధం చేశారు. విశాఖ జిల్లా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు మాట్లాడుతూ,బకాయిలు అడిగినందుకు తిరిగి ఉద్యోగ ఉపాధ్యాయుల పైనే అక్రమ కేసులు పెట్టడం సరికాదన్నారు.జిల్లా కార్యదర్శి కళింగ సతీష్ మాట్లాడుతూ, బకాయిలు పూర్తిగా చెల్లించే వరకు యుటిఎఫ్ పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా సహా అధ్యక్షులు పి.గాయత్రి, ఉపాధ్యాయ నాయకులు గడ్డి నాయుడు, చిట్టియ్య, జల్లూరు ప్రసాద్, లోవరాజు, సాంబమూర్తి, గంట్యాడ అప్పలరాజు పాల్గొన్నారు.

అచ్యుతాపురం:ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దేశంలో ఎక్కడా లేనివిధంగా జిపిఎస్ మోసపూరిత పింఛన్ విధానాన్ని తీసుకు వచ్చిన జీవో ప్రతులను ఆదివారం మడుతురు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ భాగస్వామ్య పింఛన్ ఉద్యోగుల అసోసియేషన్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.త్రినాధ స్వామి భోగి మంటలలో వేశారు. రాష్ట్రంలో 15 లక్షల పైగా ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు ఉన్నారని చెప్పారు.

సిపిఐ ఆధ్వర్యాన ఆందోళన

కే.కోటపాడు: మండలం మర్రివలస గ్రామంలో జీవో 27 రద్దు చేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల సిపిఐ నాయకులు జీవో కాపీలను భోగి మంటల్లో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వేచలపు కాసుబాబు, మండల సిపిఐ కార్యదర్శి గొర్లె దేవుడు బాబులు మాట్లాడుతూ, భూ సర్వే కూడా సమగ్రంగా జరగకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. గ్రామాల్లో భూ సమస్యలు ఎక్కువగా రెవెన్యూ అధికారులతోనే వస్తున్నాయన్నారు.జీవో 27ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి అప్పలనాయుడు, ఇల్లాకు రాము, పొంతపల్లి రామారావు, పాల్గొన్నారు.